క్లుప్తంగా

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల గుర్తింపు నేడు

పాయకరావుపేట: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు వైకల్య నిర్ధారణ శిబిరాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంఈవోలు కె.ఎన్. గాంధీ, జి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా 0–18 వయస్సు కలిగిన దివ్యాంగ విద్యార్థుల ప్రత్యేక అవసరాలను గుర్తించి వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు, ట్రై సైకిల్స్, రోలేటర్స్, బ్యాటరీ ట్రై సైకిల్స్ వంటి ఉపకరణాలు అందజేస్తామన్నారు. దీనికి సంబంధించి ఆధార్, రేషన్‌కార్డ్, సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువపత్రం, రెండు పాస్ సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు.

సీఐటీయూ జిల్లా కార్యదర్శిగా రొంగలి రాము



సీఐటీయూ జిల్లా నూతన కమిటీలో ఎన్నికైన మండల నాయకులు

అచ్యుతాపురం రూరల్: సీఐటీయూ అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా రొంగలి రాము ఎన్నికయ్యారు. ఈ నెల 6,7 తేదీల్లో చోడవరంలో జరిగిన సీఐటీయూ జిల్లా మహాసభల్లో మండలానికి తగు ప్రాతినిధ్యం లభించిందని ఆయన సోమవారం తెలిపారు. జిల్లా కమిటీ సభ్యునిగా కూండ్రపు సోమునాయుడు, కర్రి నాయుడు (ఆటో), ఎ.నాగేశ్వరరావు (పంచాయతీ), రాజాన సత్తిబాబు (ముఠా), పి.నారాయణమ్మ (అంగన్‌వాడీ) నూతన కమిటీకి ఎన్నికయ్యారన్నారు. అచ్యుతాపురం సెజ్ పరిసర ప్రాంతాల్లో పరిశ్రమ కార్మికులతోపాటు అసంఘటిత రంగ, వలస కార్మికులు, స్కీం వర్కర్ల సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్న దృశ్యం

మునగపాక: రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి సూచించారు. మునగపాక మండల సముదాయానికి వెళ్లే మార్గంలో రూ.3 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి నిర్మాణం అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. రహదారి ఏర్పాటు ద్వారా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే అధికారులు, అర్జీదారులకు మేలు జరుగుతుందన్నారు. మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్ పాల్గొన్నారు.

10న ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో ఈ నెల 10వ తేదీన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సత్యసాయి భజన మండలి తిమ్మరాజుపేట జోన్–1 ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: చిత్తశుద్ధితో పని చేసిన ఉపాధ్యాయులకు ఎక్కడ పనిచేసినా గుర్తింపు ఉంటుందని ప్రధానోపాధ్యాయిని సుధామాధురి తెలిపారు. ఇటీవల పలు పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సోమవారం పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సభ ఏర్పాటు చేసి సన్మానించారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో హాకీ జట్టు సంబరాలు

నక్కపల్లి: భారత హాకీ జట్టు ఆసియా కప్పు సాధించడం పట్ల సోమవారం నక్కపల్లిలో బీఎస్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా హాకీ క్రీడాకారులు నక్కపల్లి పురవీధుల్లో జాతీయ జెండాలు చేతపట్టి ర్యాలీలు నిర్వహించారు. భారత జట్టుకు శుభాకాంక్షలు చెబుతూ నినాదాలు చేశారు. భారత హాకీ జట్టు ఆసియా కప్పు సాధించడం గర్వంగా ఉందని హాకీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బీ సూరిబాబు, కే తాతాజీ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఆమె అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈవోపీఆర్డీ సోమరాజు, మండల ఇంజనీరింగ్ అధికారి గులామ్, హౌసింగ్ ఏఈ రాము, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.



ఇంకా పూర్తికాని అదనపు గదులు, ప్రయాణికుల వెయిటింగ్ హాల్



ప్రయాణికులు నడిచి వెళ్లలేని విధంగా ఉన్న రెండో నంబరు ప్లాట్ ఫాం



పూర్తికాని ఫుట్ ఓవర్ వంతెన



రెండో నెంబరు ప్లాట్ ఫాంపై అసంపూర్తిగా ఉన్న రూఫ్ షెడ్

అమృత్ ఆలస్యం!

- నత్తనడకగా రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- 3 ఏళ్ల క్రితం ఆధునికీకరణ పనులు ప్రారంభం
- రూ.13.13 కోట్లతో పనులు



యలమంచిలి రైల్వేస్టేషన్



తాగునీటి కుళాయిల సామగ్రి

యలమంచిలి రూరల్: అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన యలమంచిలి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇక్కడ అధునాతన సౌకర్యాల కల్పనకు మూడేళ్ల క్రితం కేంద్రం ప్రభుత్వం రూ.13.13 కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తంతో చేపట్టిన ఆధునికీకరణ పనులు ప్రారంభంలో వేగవంతంగా సాగి, ఇటీవల చాలా నెమ్మదించాయి. ప్రధాన భవనం పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో ఏడీఆర్‌ఎం, ఇతర అధికారుల బృందం పరిశీలించి ఆదేశించినా అనేక పనులు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సా..గుతున్న అభివృద్ధి పనులు

రైల్వేస్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ అరకొరగానే జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రెండు ప్లాట్‌ఫాంలపై గ్రానైట్,టైల్స్ ఏర్పాటు, కొత్తగా మూడో ప్లాట్ ఫాం అభివృద్ధి, ప్రయాణికులు ప్లాట్ ఫాం దాటేందుకు వీలుగా ఫుట్ ఓవర్ వంతెన, లిఫ్ట్, మూడు ప్లాట్‌ఫాంలు కలిపి తాగు నీటి సౌకర్యం, ప్రయాణికుల వెయిటింగ్ హాల్, అదనపు గదుల నిర్మాణం, ప్లాట్‌ఫాంలపై ప్రత్యేక రూఫ్ షెడ్లు, స్టేషన్ బయట ప్రహరీ, ప్రత్యేక పార్కింగ్, సూచిక బోర్డులు వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. దివ్యాంగుల కోసం ప్రత్యేక ప్రవేశానికి మార్గాలు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా పూర్తి ఆధునిక సౌకర్యాలతో టాయిలెట్లు నిర్మించాలి. ఈ పనులన్నీ ప్రస్తుతం నెమ్మదిగా జరుగుతున్నాయి. ఎప్పటికి పూర్తవుతాయో రైల్వే అధికారులు కూడా చెప్పలేని పరిస్థితి ఉంది. ఈ ఏడాది మే, జూలై నెల ల్లో ఇక్కడ పనులను పరిశీలించడానికి వచ్చిన ఏడీఆర్‌ఎం, ఇతర అధికారుల బృందం పనులు నత్తనడకన జరగడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అయినప్పటికీ పనులు మరింత నెమ్మదించాయి.

ప్రయాణికుల అవస్థలు

రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి పనుల కారణంగా స్త్రీ, పురుషులకు రెండు తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేశారు. వీటిలో పురుషుల టాయిలెట్‌కు ఎప్పుడూ తాళం వేస్తున్నారు. దీంతో మహిళలు, పురుషులకు ఒక్కటే కామన్ టాయిలెట్ కావడంతో అందరికీ ఇబ్బంది తప్పడంలేదు. దాని నిర్వహణ కూడా అత్యంత అధ్వానంగా ఉంటోంది. తీవ్ర దుర్గంధం రావడంతో వాటి దగ్గరకు వెళ్లేందుకే ప్రయాణికులు నరకం చవిచూస్తున్నారు. దీంతో పలువురు మహిళా ప్రయాణికులు వారు ఎక్కాల్సిన రైలొచ్చే వరకు కాలకృత్యాలకు వేచిచూడాల్సిన పరిస్థితి ఉంటోంది. ఇక ప్లాట్‌ఫాంలపై అభివృద్ధి పనులు పూర్తి కాకపోవడంతో అక్కడక్కడా గోతులు ఉన్నాయి. రైలెక్కేటపుడు, దిగేటపుడు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, వృద్ధులు గోతులను గుర్తించలేక జారిపడుతున్న సందర్భాలు ఉన్నాయి. ఇక రెండో నెంబరు ప్లాట్‌ఫాంపై బటర్ ఫ్లై షెడ్ల నిర్మాణం పూర్తి కాలేదు. వర్షం కురిసినా, ఎండ తీవ్రత ఎక్కువైనా ప్రయాణికుల బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. రైల్వే ఉన్నతాధికారులు ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రైలు ప్రయాణికులు మొరపెట్టుకుంటున్నారు. కూటమి ప్రజా ప్రతినిధులు దీనిపై దృష్టి పెట్టకపోవడం దురదృష్టకరమని పలువురు విమర్శిస్తున్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు



రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ పనులను వెంటనే పూర్తయ్యేలా చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి. నెలల తరబడి ఆధునికీకరణ పనులు జరుగుతుండడంతో రైలు ప్రయాణికులు పడుతున్న బాధలు ఎవ్వరికీ పట్టడంలేదు. అసంపూర్తి పనుల కారణంగా కొత్త సమస్యలు నెలకొన్నాయి. రైల్వే అధికారులు పనులకు నిర్ణీత సమయంలోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఎంతో కాలంగా ప్రశాంతి, మెయిల్, లింక్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు సౌకర్యం కల్పించాలి. కోచ్ డిస్‌ప్లే బోర్డులు, రైళ్ల రాకపోకల సమాచారంతో కూడిన సూచిక బోర్డులు వెంటనే ఏర్పాటు చేయాలి.

– కొఠారు దుర్గారావు, యలమంచిలి

కూటమి ప్రభుత్వ మెడలు వంచుదాం

- నేటి అన్నదాత పోరును జయప్రదం చేయండి
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ



యలమంచిలిలో అన్నదాత పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న కరణం ధర్మశ్రీ, నాయకులు



రాంబిల్లిలో పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న వీసం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

యలమంచిలి రూరల్/అచ్యుతాపురం రూరల్: రాష్ట్రంలో కనీసం ఎరువులను కూడా పంపిణీ చేయలేని కూటమి ప్రభుత్వం మెడలు వంచైనా అన్నదాతలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ యలమంచిలి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పేర్కొన్నారు. మంగళవారం అనకాపల్లిలో నిర్వహించ తలపెట్టిన అన్నదాత పోరు పోస్టర్లను ఆయన యలమంచిలి, అచ్యుతాపురం పార్టీ కార్యాలయాల్లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి నేతల మద్దతుతో యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నా పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఆర్బీకేల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు అందించామన్నారు. కూటమి ప్రభుత్వం యూరియాను సకాలంలో అందించడంలో విఫలమైందన్నారు. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఎన్ని ఎకరాలున్నా, ఒక్కో రైతుకు ఒక్క బస్తా మాత్రమే ఇచ్చి మభ్యపెడుతుందని విమర్శించారు. అన్నదాత పోరు కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పార్టీ కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. ఎంపీపీలు బోదెపు గోవింద్, ఎంపీపీ కోన సంధ్యబుజ్జి, కో ఆప్షన్ జెడ్పీటీసీ సభ్యుడు నర్మాల కుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర, కొల్లి త్రినాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు సేనాపతి రాము, దూది నర్సింహమూర్తి, కొఠారు కొండబాబు, పిల్లా త్రినాథరావు, మర్రి రాజు, దాసరి కుమార్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఉద్దండం త్రినాథరావు(యూటీఆర్), నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు బలిరెడ్డి శ్రీను, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు సియ్యాద్రి బుజ్జి, వర్రే గాంధీ, పోలరౌతు నర్సింగరావు, గొర్లి వెంకట్, రాపేటి సంతోష్, దుంగా అచ్యుతరావు, గొంపాని శివ, అడపా అప్పలనాయుడు, దుబాసి అప్పలనాయుడు, కోడిగుడ్డు రమణ, ఈరిగిల చంటి, బొచ్చ అప్పారావు, యర్రంశెట్టి చినబ్బాయి, మొగలపల్లి గణేష్, సర్పంచ్‌లు లాలం వాణీవాసు, గొర్లి అశ్వినీనూకరాజు, పంచదార్ల పైడిరాజు, కూండ్రపు సత్యారావు, మాడెం సూరి అప్పారావు, కొమ్మోజు ఈశ్వరరావు, పంచదార్ల రవి, పంచదార్ల చిన్న, మోటూరు శ్రీకాంత్ పాల్గొన్నారు.

అన్నదాత పోరును విజయవంతం చేయండి

రాంబిల్లి(అచ్యుతాపురం)/మునగపాక: రైతులకు అండగా నిలవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్రంలో యూరియా కొరతే దీనికి నిదర్శనమని రాంబిల్లి ఎంపీపీ శిరీష శ్రీనుబాబు విమర్శించారు. రాంబిల్లిలోని మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు నివాసం వద్ద సోమవారం అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. మునగపాకలోని బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు కిశోర్, సీనియర్ నాయకులు నెట్టం సత్యనారాయణ, నీరుకొండ వెంకట సూరి, కొవ్వూరు రామకృష్ణ, సర్పంచ్‌లు బొడ్డేడ శ్రీనివాసరావు, కర్రి పెదబ్బాయి, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, పార్టీ నేతలు కాండ్రేగుల జగన్, బొడ్డేడ లిల్లీ, పిట్టా మంగారెడ్డి, శరగడం జగన్నాథరావు, ఆడారి కాశీబాబు, రమేష్, పెంటకోట సత్యనారాయణ, ద్వారం జానకీరామ్, మళ్ల కన్నుంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరు విజయవంతం చేయాలి

నక్కపల్లి: అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ కోరారు. సోమవారం ఆయన నక్కపల్లి పార్టీ కార్యాలయం వద్ద మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు అందాల్సిన యూరియా పక్కదారి పడుతోందన్నారు. పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలు కావడం లేదన్నారు. ఈ సమస్యలపై మంగళవారం అనకాపల్లిలో నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమాన్ని రైతులు, పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ, చందనాడ సర్పంచ్ తళ్ల రోహిణీ భార్గవ్, వార్డు సభ్యులు కే దుర్గాప్రసాద్, అల్లాడ కొండ, జీ బంగార్రాజు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం

బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీలో నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీ



మాట్లాడుతున్న సమన్వయకర్త ధర్మశ్రీ, చిత్రంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు ఒరిగిందేమీ లేదని, సీజన్‌కు అవసరమయ్యే ఎరువులను అందుబాటులోకి తీసుకురావడంలో విఫలమైందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ విమర్శించారు. ఎన్నికల హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీలో భాగంగా మండలంలోని పాటిపల్లి, మూలపేట గ్రామాల్లో సోమవారం రాత్రి రచ్చబండ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు వాటిని మరిచిపోవడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, భీశెట్టి గంగప్పలనాయుడు, బొడ్డేడ శ్రీను, ఎంపీటీసీలు మద్దాల వీరునాయుడు, ఇల్లా నాగేశ్వరరావు, బొడ్డేడ బుజ్జి, పార్టీ నేతలు బొడ్డేడ చెల్లయ్యనాయుడు, బొద్దపు శ్రీరామమూర్తి, సరిసా శ్రీనివాసరావు, బొడ్డేడ లిల్లీ, భీశెట్టి ధనశ్రీను, సరిసా శ్రీనివాసరావు, రాపేటి పరమేష్, రామకృష్ణ, సంజయ్, నరసింగరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై హోం మంత్రి స్పందించాలి



దగ్గుపల్లి సాయిబాబా

పాయకరావుపేట: పట్టణంలో అనధికారికంగా వేస్తున్న లేఅవుట్లపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా డిమాండ్ చేశారు. పట్టణంలో ఆయన తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో అనధికార లేఅవుట్లపైన, వాటిలో కేటాయించిన కమ్యూనిటీ స్థలాలు ఆక్రమణలుపైన అధికారులకు ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. మంత్రి ఇలాకాలో అనధికారంగా లేఅవుట్‌లు వేస్తున్నారన్నారు. వీటిపై పూర్తిస్థాయిలో నిష్పక్షపాతంగా అధికారులతో దర్యాప్తు చేయించి, ఆక్రమించిన కమ్యూనిటీ స్థలాలు పంచాయతీకి కేటాయించే విధంగాను చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా 2010 నుంచి పట్టణ పరిధిలో వేస్తున్న అనధికార లేఅవుట్లకు అనుమతులు ఇచ్చిన పంచాయతీ అధికారులుపైనా చర్యలు తీసుకునే విధంగా స్పందించాలన్నారు. కమ్యూనిటీ స్థలాలు ఆక్రమణదారులతోపాటు వీటిని అమ్ముకాలు సాగించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు పట్టణ పరిధిలో వేసిన లేఅవుట్లకు సంబంధించి కేటయించిన కమ్యూనిటీ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

తెరుచుకున్న ఆలయాలు



గ్రహణ మోక్షానంతరం ఉపమాక ఆలయాన్ని తెరుస్తున్న అర్చకులు

నక్కపల్లి: చంద్రగ్రహణం మోక్షానంతరం ఆలయాలు సోమవారం ఉదయం తెరచుకున్నాయి. ఉపమాక వేంకటేశ్వ స్వామి ఆలయంలో తెల్లవారు జామున సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చకుడు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో సంప్రోక్షణ, తిరుమంజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం శుద్ధి కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దేవస్థానం ఆఫీసు అసిస్టెంట్ మునిగిరీష్, టీటీడీ విజిలెన్స్‌కు చెందిన రోహిణి, చంద్రరావు పాల్గొన్నారు. భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వర స్వామి ఆలయం ఒడ్డిమెట్ట లక్ష్మిగణపతి ఆలయాల్లో సంప్రోక్షణ, తిరుమంజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన సేవలు కల్పించారు.

అక్షర వెలుగులు నింపడమే లక్ష్యం

మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి

యలమంచిలి రూరల్: వయోజనుల్లో వంద శాతం అక్షరాస్యత నింపడమే లక్ష్యంగా అక్షరాంధ్ర (ఉల్లాస్)కార్యక్రమం అమలు చేస్తున్నట్టు యలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి తెలిపారు. సోమవారం యలమంచిలి మెప్మా కార్యాలయంలో అక్షరాంధ్ర వలంటీర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వయోజనవిద్య సంచాలకుడు చిన్నికృష్ణ మాట్లాడుతూ యలమంచిలిలో 3998 మంది వయోజనులను నిరక్షరాసులుగా గుర్తించినట్టు తెలిపారు. వీరందర్నీ అక్షరాస్యులుగా మార్చడానికి 400 మంది వలంటీర్లను ఎంపిక చేశామన్నారు. అనంతరం అక్షరజ్యోతి పుస్తకాలను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, మెప్మా సీఎంఎం పద్మావతి, 90 మంది వలంటీర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిర్వాసితుల ఆందోళన



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నిర్వాసితులు

నక్కపల్లి: విశాఖ– చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం నివాస ప్రాంతాలు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వాసితులు ఆందోళన చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం అప్పలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘించిందన్నారు. నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.8.98 లక్షలు మాత్రమే చెల్లించిందన్నారు. బాధిత కుటుంబాల్లో వివాహమైన ఆడపిల్లలకు రూ.25 లక్షల చొప్పున ప్యాకేజీ చెల్లించాలని ఏడాది నుంచి ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా ఈ నెల 27 ఆర్సిలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ప్రజాభిప్రాయ సేకరణ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. తహసీల్దార్ నర్సింహమూర్తికి వినతి పత్రం అందజేశారు.

విద్య నేర్చుకోవడానికి వయసు అడ్డంకి కాదు

- వయోజన విద్యాశాఖ డీడీ చిన్నికృష్ణ



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డీడీ చిన్ని కృష్ణ

నక్కపల్లి: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో నక్కపల్లి, పెదబోదిగల్లం, చినదొడ్డిగల్లు తదితర పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. వయోజన విద్యాశాఖ డీడీ చిన్నికృష్ణ, హెచ్‌ఎంలు బాలాజీ, జయశ్రీ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గౌరవం, సంస్కారం, విలువలు పెంపొందుతాయన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు ఆచార్యులు మాట్లాడుతూ అక్షరాస్యత అంటే స్పష్టంగా చదవడం రాయడం మాట్లాడగలగడంతోపాటు మారుతున్న కాలంలో డిజిటల్ ప్రగతి కూడా సాధించడం అన్నారు. నక్కపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో వయోజన విద్యాశాఖ డీడీ వయోజన విద్య బ్రోచర్ విడుదల చేశారు. ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవోలు కుంచం నరేష్, నాగన్న దొర, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఏఎంసీ చైర్మన్ దేవర సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, ఉపాధ్యాయులు ఎ.వి.ఎల్.కుమారి, వి.పద్మావతి, ఫల్గుణరావు, పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో విద్యుత్ సమస్య

పరిష్కరించాలని వినతి



వెంకటనగరంలో జగనన్న కాలనీ

పాయకరావుపేట: మండలంలో వెంకటనగరం గ్రామ పరిధి జగనన్న కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కాలనీకి వాసులు సోమవారం విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందించారు. జగనన్న కాలనీలో గతంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ తొలగించడం వల్ల విద్యుత్ సమస్య ఏర్పడిందన్నారు. గతంలో 6 మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి కొన్నింటిని అక్కడి నుంచి వేరొకచోటికి తరలించారన్నారు. ఇక్కడ మినీ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో తరచూ అంతరాయం ఏర్పడుతుందని అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు.

ఆశ వర్కర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ



వైద్యాధికారి శ్రావ్య

అచ్యుతాపురం రూరల్: మండలంలో ఎనిమిది ఆశ వర్కర్ల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.శ్రావ్య సోమవారం తెలిపారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు హరిపాలెం పీహెచ్‌సీ పరిధిలో చీమలాపల్లి–2, కొండకర్ల–1, ఎమ్.జగన్నాథపురం–1, అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధిలో చోడపల్లి–1, దిబ్బపాలెం–2, పూడిమడక–1 పోస్టులకు ఈ నెల 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థి అదే గ్రామానికి చెందిన వారై ఉండి, వయస్సు 25 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. విద్యార్హత కనీసం పదో తరగతి ఉత్తీర్ణత కలిగి, పరిచయ శక్తి, నాయకత్వ లక్షణాలతోపాటు కుటుంబం నుంచి పూర్తి మద్దతు ఉండాలని సూచించారు. మరిన్ని వివరాలకు స్థానిక పీహెచ్‌సీలో సంప్రదించాలన్నారు.